గాంధీ పార్కును గాలికొదిలేశారు

- ఏడాదైనా తెరుచుకోని దానవాయిపేట గాంధీ పార్కు
- వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో రూ.2.5 కోట్లతో పార్కు ఆధునీకరణ
- వివక్షతో ప్రారంభించకుండా వదిలేసిన కూటమి నేతలు

రాజమహేంద్రవరం సిటీ: రాజమహేంద్రవరం నగరం నడిబొడ్డున గల దానవాయిపేట మెయిన్‌రోడ్‌లో నగరపాలక సంస్థ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న దానవాయిపేట గాంధీ పార్క్ పనులు పూర్తయినా పునఃప్రారంభించకపోవడంతో స్థానికులకు ఎదురు చూపులే మిగిలాయి. 2023లో అప్పటి రాజమహేంద్రవరం ఎంపీ మార్గాని భరత్‌రామ్ రూ.2.50 కోట్ల నగరపాలక సంస్థ నిధులతో ఆధునీకరణకు శంకుస్థాపన చేశారు. మూడు నెలల్లో పనులు పూర్తి చేసి ప్రారంభిస్తామని నగర పాలక సంస్థ అధికారులు ప్రకటించారు. పనులు మొదలెట్టి ఏడాదైనా పార్కు పునఃప్రారంభం కాకపోవడంతో నిత్యం గాంధీ పార్కుకు వచ్చేవారు నిరాశతో వెనుదిరుగుతున్నారు. నగర ప్రజలు ఆనందానికి, ఆహ్లాదానికి వేదికగా నిలిచే దానవాయిపేట గాంధీ పార్క్ ఏడాదిగా మూసివేయడంతో రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ కోసం వెళ్లే వృద్ధులు, మహిళలు, యువత ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆరోగ్య రక్షణ కోసం ఉదయం, సాయంత్రం వేళల్లో వాకింగ్ నిర్వహించాలంటే ఎక్కడో దూరాన గల కంబాల చెరువు పార్కుకు వెళ్లాల్సిన దుస్థితి నెలకొంటుందన్నారు. ఆధునీకరణ పనులు పూర్తయిన పార్క్‌ను ప్రారంభించడానికి అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారని, తక్షణమే నగరపాలక సంస్థ కమిషనర్ ప్రత్యేక దృష్టి సారించి చర్యలు చేపట్టాలని నగర ప్రజలు కోరుతున్నారు.



పనులు పూర్తి చేసుకున్న దానవాయిపేట గాంధీ పార్కు

కమిషనర్ నివాసానికి కూతవేటు దూరంలో

దానవాయిపేట మెయిన్‌రోడ్‌లో నివాసం ఉంటున్న నగరపాలక సంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ బంగ్లాకు గాంధీ పార్కు కూతవేటు దూరంలో మాత్రమే ఉంది. నిత్యం ఈ పార్క్ మీదుగా నగర పాలక సంస్థ కార్యాలయానికి రాకపోకలు సాగించే కమిషనర్ పార్కు పునఃప్రారంభంపై దృష్టి పెట్టకపోవడం నగర ప్రజలను విస్మయానికి గురి చేస్తుంది. కేవలం వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో ఆధునీకరణ చేపట్టిన కారణంగానే కూటమి నేతలు గాంధీ పార్కును పునఃప్రారంభించడం లేదన్న విమర్శలు కార్పొరేషన్ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. ఈ విషయంపై నగరపాలక సంస్థ ఎస్ఈ పాండురంగారావును వివరణ కోరగా త్వరలోనే గాంధీ పార్కును పునఃప్రారంభిస్తామని తెలిపారు.

ఆధునీకరణ పూర్తయినా మూసే ఉంచుతారా?



నిత్యం వాకింగ్ కోసం వినియోగించే గాంధీ పార్క్‌ను ఏడాదిగా మూసివేయడం చాలా ఇబ్బందికరంగా ఉంది. పనులు మొదలు పెట్టే సమయంలో మూడు నెలల్లో ఆధునీకరించి ప్రారంభిస్తామని ప్రకటించారు. ఇప్పుడేమో పనులు పూర్తయినా పార్క్ తెరవకపోవడం దారుణం. ఇప్పటికైనా అధికారులు స్పందించి చర్యలు చేపట్టాలి.

– అడపా(గెడ్డం) రమణ, ట్రేడ్ యూనియన్ నాయకుడు, రాజమహేంద్రవరం

అందుబాటులోకి తీసుకురావాలి



మహిళలు, వృద్ధులు రోజూ ఉదయం, సాయంత్రం వేళల్లో పార్కులో వాకింగ్ చేసేందుకు ఎంతో అనుకూలంగా ఉండే గాంధీ పార్కును ఇంతకాలం పాటు మూసేయడం సరికాదు. వాకింగ్‌కు ఏడాదిగా స్థానికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిర్మాణం పనులు పూర్తి చేసి పార్కును అందుబాటులోకి తీసుకు రావాల్సిన నగర పాలక సంస్థ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించడం దుర్మార్గం.

– మరద దేదీప్య కళ్యాణిరెడ్డి, రాజమహేంద్రవరం

క్లుప్తంగా

వరద బాధితులకు నిత్యావసరాల పంపిణీ


నిత్యావసర సరకులను పంపిణీ చేస్తున్న చారిటీ సభ్యులు

సీటీఆర్ఐ: విజయవాడలోని అజిత్‌సింగ్ నగర్‌లో వరద బాధితులకు రాజమహేంద్రవరానికి చెందిన గుడ్ ఫ్రెండ్స్ చారిటీ ఆధ్వర్యంలో నిత్యావసర సరకులను ఆదివారం పంపిణీ చేశారు. చారిటీ నిర్వాహకుడు నాగచక్రం మాట్లాడుతూ ఇటువంటి పరిస్థితుల్లో ప్రభుత్వం ఆర్థిక సాయం అందించడమే కాకుండా బాధితులకు మనోధైర్యాన్ని ఇవ్వాలన్నారు. కాని ఇప్పటికీ వారికి ప్రభుత్వం నుంచి సరైన సాయం అందలేదని, నిర్వాసితులను చూసి చలించిపోయామన్నారు. కార్యక్రమంలో మాధురి, కవిత అల్లాడ, మేకా సూర్యప్రకాష్, బుర్ర సురేష్ తదితరులు పాల్గొన్నారు.

యువత క్రమశిక్షణతో ఎదగాలి


యూత్ సండేలో పాల్గొన్న యువత

సీటీఆర్ఐ: యువత ఆధునిక పోకడలతో లక్ష్యానికి దూరంగా ఉండకుండా క్రమశిక్షణతో ఎదగాలని ఎర్నెస్ట్ మోజెస్ అన్నారు. స్థానిక లూథర్ గిరి క్రైస్ట్ చర్చ్‌లో యువజనుల దినోత్సవాన్ని ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మోజెస్ మాట్లాడుతూ దైవ వాక్యానుసారం పద్ధతిగా జీవనం సాగించాలన్నారు. యువతీ యువకులు గీతాలు ఆలపించి ఆరాధన జరిపించారు. టి.మార్టిన్ సుధాకర్, సతీష్, సుహాస్ అందించిన సంగీతం ఆహూతులను అలరించింది. కార్యక్రమంలో శ్రావణ్, మోనికా, మేరీ క్రిస్టియానా, సువర్ణకుమార్, పాస్టర్స్ జి.ప్రార్థనకుమార్, వి.డేవిడ్ కుమార్ పాల్గొన్నారు.

2 నుంచి చదరంగం పోటీలు

ప్రకాశం నగర్ : జిల్లా చదరంగం సంఘం ఆధ్వర్యంలో వచ్చే నెల 2వ తేదీ నుంచి అండర్–9 బాలురు, బాలికల విభాగంలో స్థానిక శ్రీగౌతమి స్మార్ట్ స్కూల్‌లో జిల్లా చదరంగం పోటీలు నిర్వహించనున్నట్లు అసోసియేషన్ కార్యదర్శి కుమార్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2015 జనవరి 1 తర్వాత జన్మించిన వారు ఈ పోటీలకు అర్హులని తెలిపారు. పోటీల్లో పాల్గొనదలిచిన క్రీడాకారులు ఏపీ చెస్‌ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో పేర్లు నమోదు చేసుకోవాలని సూచించారు.

నూతన కార్యవర్గం ఎన్నిక


రాష్ట్ర స్థాయిలో ఎన్నికైన నూతన కార్యవర్గ సభ్యులు

రాజమహేంద్రవరం సిటీ: ఏపీ టైలర్స్ సొసైటీల సమాఖ్య రాష్ట్ర నూతన కార్యవర్గం ఎన్నిక కార్యక్రమం ఆదివారం నగరంలోని స్థానిక అన్నపూర్ణమ్మపేటలోని నగర నాయీ బ్రాహ్మణ అసోసియేషన్ హాల్‌లో నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా వివిధ జిల్లాలకు చెందిన పలు టైలర్స్ సొసైటీల ప్రతినిధులు ఈ సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడిగా పొగులమల్లి మల్లికార్జునరావు, కార్యదర్శిగా డీఎస్ఎస్ సుబ్రహ్మణ్యం, కోశాధికారిగా బసవ దుర్గారావులను ఎన్నుకున్నారు. మిగిలిన కార్యవర్గ సభ్యులను త్వరలోనే ఎన్నుకుంటామన్నారు. ఈ సందర్భంగా మల్లిఖార్జున రావు మాట్లాడుతూ టైలర్స్ ఫెడరేషన్ ఏర్పాటు కోసం సొసైటీలు ఈ సమావేశం ఏర్పాటు చేసుకుని పలు తీర్మానాలు చేసినట్లు తెలిపారు. తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించే దిశగా రాష్ట్ర నాయకత్వం పనిచేస్తుందన్నారు.

సినిమాలు

శ్యామల	దేవర
సూర్యమినీ	సత్యం సుందరం
సూర్యప్యాలెస్	దేవర
స్వామి	దేవర
అశోక	దేవర
శివజ్యోతి	కళింగ
రాజా	దేవర
రంభ	దేవర
ఊర్వశి	సత్యం సుందరం
మేనక	మత్తు వదలరా–2
కుమారి	దేవర
అప్సర	దేవర
నామవరం	
వీఎస్ మహల్	దేవర
ధవళేశ్వరం	
మురళీకృష్ణ	దేవర
కడియం	
వెంకటసూర్య	దేవర

ముగిసిన న్యాయవాదుల క్రీడాపోటీలు

ప్రకాశం నగర్: రాజమండ్రి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో న్యాయవాదులకు నిర్వహించిన రాష్ట్ర స్థాయి షటిల్, బ్యాడ్మింటన్, క్యారమ్స్ పోటీలు ఆదివారంతో ముగిశాయి. షటిల్ డబుల్స్ విభాగంలో రాజమండ్రికి చెందిన డీవీవీ త్రినాథ్, కె.హ్యాపీ వినోద్‌లు, షటిల్ సింగిల్స్‌లో కె.హ్యాపీ వినోద్ గెలుపొందారు. రన్నర్స్ విభాగంలో అనకాపల్లికి చెందిన రోమాల అప్పలనాయుడు గెలుపొందగా మిక్స్‌డ్ డబుల్స్ విన్నర్స్ విభాగంలో కె.హ్యాపీ వినోద్, కుమారి కడియాల సరిత గెలుపొందారు. షటిల్ మహిళల సింగిల్స్, డబుల్స్ విభాగంలో విజయవాడకు చెందిన రాధా కిరణ్మయి, బి.సునీతలు విజేతలుగా నిలిచారు. చెస్ విన్నర్‌గా విజయవాడకు చెందిన ఎం.శ్రీనివాసరావు, రన్నర్‌గా శాల్మన్ రాజు గెలుపొందారు. క్యారమ్స్ విన్నర్‌గా విజయవాడకు చెందిన శ్రీనివాసరావు, రన్నర్‌గా అనకాపల్లికి చెందిన గంగాధరరావు, క్యారమ్స్ డబుల్స్ విభాగంలో విజయవాడకు చెందిన రానా ప్రసాద్ విక్టర్ గెలుపొందగా, రన్నర్స్‌గా సత్యానంద్, శ్రీనివాసరావు నిలిచారు. విజేతలకు జిల్లా ప్రిన్సిపల్ జడ్జ్ గంధం సునీత చేతుల మీదుగా మెమొంటోలు, ప్రశంసా పత్రాలు అందజేశారు.

కనకదుర్గ అమ్మవారికి వెండి కిరీటం సమర్పణ

రంగంపేట: మండల పరిధిలోని చంద్రేడులో కొలువైన కనకదుర్గ అమ్మవారికి భక్తులు వెండి కిరీటం సమర్పించినట్టు ఆలయ అర్చకుడు మైలవరపు కృష్ణ ఆదివారం తెలిపారు. గ్రామానికి చెందిన దాత బొడ్డు వెంకట్రావు, మంగతాయి దంపతులు రూ.31,600లతో వెండి కిరీటం తయారు చేయించి అమ్మవారికి సమర్పించారన్నారు. ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారికి వెండి కిరీటం అలంకరించినట్టు చెప్పారు.

వ్యాయామంతో గుండెకు మేలు


3కే వాక్‌థాన్‌లో పాల్గొన్న వైఎస్సార్ సీపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: రోజుకు 30 నిమిషాల చొప్పున వారానికి ఐదు రోజులు పాటు వ్యాయామం చేస్తే గుండెపోటును నివారించవచ్చని వైఎస్సార్ సీపీ పార్లమెంట్ ఇన్‌చార్జ్ డాక్టర్ గూడూరి శ్రీనివాస్ విజ్ఞప్తి చేశారు. ప్రపంచ హార్ట్ డే సందర్భంగా నగరంలోని తిలక్ రోడ్ పల్స్ హాస్పటల్ ఆధ్వర్యంలో 3కే వాక్‌థాన్ నిర్వహించారు. అనంతరం ఉచిత కార్డియాక్ మెడికల్ క్యాంప్ జరిగింది. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ గూడూరి శ్రీనివాస్ వాక్‌థాన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా గుండెపోటుపై అవగాహన కల్పించారు. ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ కొల్లూరు లక్ష్మణ్, డాక్టర్ కోసూరి వంశీకృష్ణ రాజుల ఆధ్వర్యంలో తిలక్ రోడ్ నుంచి హ్యాపీ స్ట్రీట్ మీదుగా ఐఎంఏ హాల్ వరకూ వాక్‌థాన్ నిర్వహించారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కార్డియాలజిస్టులు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ వంశీకృష్ణరాజు సభ్యులకు గుండె జబ్బులపై అవగాహన కల్పించారు. నిత్య వ్యాయామం, ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లు గుండెకు మేలు చేస్తాయన్నారు. మానసిక ఒత్తిడి కూడా గుండె జబ్బులకు కారణం అవుతుందన్నారు. వరల్డ్ హార్ట్ డే సందర్భంగా పల్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత మెగా కార్డియాక్ క్యాంపునకు విశేష స్పందన లభించిందని కార్డియాలజీ నిపుణులు డాక్టర్ లక్ష్మణ్, డాక్టర్ వంశీకృష్ణరాజు తెలిపారు. ఈ క్యాంప్‌లో 280 మందికి ఉచితంగా ఈసీజీ, 2డీ ఎకో, రక్త పరీక్షలు నిర్వహించామన్నారు. కొంతమందికి శస్త్ర చికిత్సలు అవసరమని వారికి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా నిర్వహిస్తామన్నారు. సామాజిక సేవ దృక్పథంతో త్వరలో మరిన్ని ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తామని తెలిపారు.


3కే రన్‌లో పాల్గొన్న జవహర్ వాకర్స్ క్లబ్ సభ్యులు

నగరంలో 3కే రన్

సీటీఆర్ఐ: ప్రపంచ గుండె దినోత్సవం సందర్భంగా జవహర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో నగరంలో ఆదివారం 3కే రన్ నిర్వహించారు. స్థానిక వెంకటేశ్వరనగర్‌లోని జవహర్ వాకర్స్ క్లబ్ అధ్యక్షుడు సత్యనారాయణ నేతృత్వంలో వాకర్స్ అందరికీ గుండె జబ్బులపై అవగాహన కల్పించేందుకు 3కే రన్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర వంశీ కృష్ణంరాజు గుండె సక్రమంగా పనిచేయడానికి, గుండె జబ్బులు రాకుండా ఉండటానికి తీసుకోవలసిన జాగ్రత్తలు గురించి వివరించారు. వయసు పైబడిన వారికే కాకుండా చిన్న పిల్లలకు కూడా గుండె జబ్బులు పెరిగిపోతున్నాయన్నారు. ప్రతిఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయమం, వాకింగ్ చేయడం వల్ల శరీరం ఫిట్‌గా ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఉయ్యూరి సుబ్బరాజు, క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

కన్నులపండువగా నూతన రథం ఊరేగింపు


శ్రీరంగపట్నంలో స్వామివారి రథాన్ని ప్రారంభిస్తున్న జక్కంపూడి రాజా

మధురపూడి: కోరుకొండ మండలం శ్రీరంగపట్నంలో కొలువైన విఘ్నేశ్వరస్వామి నూతన రథం ఊరేగింపు ఆదివారం కన్నులపండువగా జరిగింది. మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా స్వామివారి ఊరేగింపులో పాల్గొన్నారు. తొలుత ఆయన స్వామివారికి ప్రత్యేక పూజలు ప్రారంభించారు. అనంతరం కొబ్బరి కాయకొట్టి రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీరంగపట్నం కళల సంస్కృతికి నిలయంగా ఉందన్నారు. గ్రామంలో కళాకారులే అధిక సంఖ్యలో ఉన్నారన్నారు. ఆధ్యాత్మిక కార్యక్రమాల నిర్వహణలో గ్రామస్తులు ముందుంటారన్నారు. స్వామివారి నూతన రథం ప్రారంభోత్సవం, ఊరేగింపులో పాల్గొనడం ఆనందంగా ఉందన్నారు. దాతల సహకారం రూ.18 లక్షలతో స్వామివారికి రథాన్ని తయారుచేయడం అభినందనీయమన్నారు. ప్రజలందరూ ఆయురారోగ్యాలు, సుఖ సంతోషాలతో ఉండాలని స్వామివారిని కోరుకున్నట్టు తెలిపారు. అనంతరం ఉత్సవ కమిటీ సభ్యులు జక్కంపూడి రాజాను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు సూరిశెట్టి అప్పలస్వామి, కుటుంబరావు, దాడి వీరబాబు, కొయిదాల నానాజీ పాల్గొన్నారు.

మల్లిపూడిలో పారిశుధ్య పనులు

రంగంపేట: మల్లిపూడిలో ఆదివారం పారిశుధ్య పనులు నిర్వహించారు. గ్రామ సర్పంచ్ వేము మాధవి ఆధ్వర్యంలో గ్రామంలోని పలు ప్రాంతాల్లో దోమల నివారణకు ఎబేట్ మందు పిచికారీ చేవారు. పారిశుధ్య సిబ్బంది రహదారులను, డ్రైనేజీలను శుభ్రం చేశారు. ప్రధాన కాలువల్లో పూడిక తీసి గ్రామ వెలుపలకు తరలించారు. సర్పంచ్ మాధవి మాట్లాడుతూ అంటువ్యాధులు రాకుండా అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు.

జాతీయ కార్యవర్గంలో ముగ్గురికి చోటు


నూతనంగా ఎన్నికైన పీఎంపీ అసోసియేషన్ జాతీయ కార్యవర్గం


ధవళేశ్వరం: పీఎంపీ అసోసియేషన్ జాతీయ కార్యవర్గంలో రాష్ట్రం నుంచి ముగ్గురికి చోటు లభించింది. ఆదివారం రాజస్థాన్‌లోని జైపూర్‌లో ఉన్న పీఎంపీ భవనంలో జాతీయ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జాతీయ నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జాతీయ కార్యవర్గ ఎన్నికల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి చెందిన వీబీటీ రాజు జాతీయ ప్రధాన కార్యదర్శిగా, ఆంధ్రప్రదేశ్ పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు తోరాటి ప్రభాకరరావు జాతీయ ఉపాధ్యక్షుడిగా, కె.జనార్ధన్ సహాయ కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సమావేశంలో కేంద్ర కార్యాలయాన్ని జైపూర్‌లో కొనసాగించేందుకు, జాతీయ స్థాయిలో పీఎంపీ అసోసియేషన్ పేరును కమ్యూనిటీ పారామెడిక్స్–ప్రైమరీ హెల్త్ కేర్ ప్రొవైడర్స్‌గా మార్పు చేసేందుకు తీర్మానించినట్లు పీఎంపీ అసోసియేషన్ నాయకులు తెలిపారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ప్రకటించారు. జాతీయ నూతన అధ్యక్షుడిగా ముఖేష్ అగర్వాల్(రాజస్థాన్), జాతీయ ప్రధాన కార్యదర్శిగా వీబీటీ రాజు(ఆంధ్రప్రదేశ్), జాతీయ కోశాధికారిగా సీఎస్ రావు(గుజరాత్), సీనియర్ ఉపాధ్యక్షుడిగా ప్రదీప్ కశ్యప్(మధ్య ప్రదేశ్), ఉపాధ్యక్షులుగా ఆర్ ప్రకాష్(రాజస్థాన్), అరుణ్‌కుమార్(ఢిల్లీ), శ్యామ్‌సుందర్ పాఠక్(మధ్యప్రదేశ్), తోరాటి ప్రభాకరరావు(ఆంధ్రప్రదేశ్) తదితరులు ఎన్నికయ్యారు. కార్యక్రమంలో పీఎంపీ అసోసియేషన్ రాష్ట్ర ప్రతినిధులు అబ్దుల్ రెహమాన్‌ఖాన్, ఎస్.వేణుగోపాల్, బళ్లా శ్రీనివాస్, దామోదర్ రెడ్డి, ఏఆర్కే పరమేశ్వర్, ఎం.జయరాం, ఎస్.సింహాచలం, పి.దేవానందం, సుభాన్, శేషయ్య, గోపాల్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

సంపరలో సత్యసాయి శత జయంత్యుత్సవం


సంపరలో సత్యసాయిబాబా వారి శత జయంతి ఉత్సవంలో పాల్గొన్న భక్తులు

పెదపూడి: సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాలను పురస్కరించుకుని విశ్వశాంతి కోసం సంపర గ్రామంలో ఆదివారం 98వ నమామిసాయి రుద్రీయం పూజలు నిర్వహించారు. ఆధ్యాత్మికవేత్తలు కె.సాయి, శ్రీహరి ప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో పండితుడు ఖండవిల్లి హనుమంతాచార్యులు సత్యసాయి బాబాకు విశేష పూజలు చేశారు. పరమేశ్వరునికి వైభవంగా ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. వేద పారాయణ చేశారు. స్థానిక సత్యసాయి సంఘ ప్రతినిధులు తిబిరిశెట్టి త్రిమూర్తులు, లక్ష్మీతులసి, కమిటీ ప్రతినిధి బి.నాగు సీత, కె.కొండయ్య కాపు దంపతులు పూజల్లో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కాకినాడ జిల్లా సత్యసాయి సేవా సమితి అధ్యక్షుడు యార్లగడ్డ గోవిందరాజులు తదితరులు పాల్గొన్నారు.

సూర్యదేవునికి ఘనంగా శాంతి కల్యాణం


సూర్యదేవుని శాంతి కల్యాణంలో మంగళసూత్రం చూపిస్తున్న అర్చకుడు వెంకటనరసింహాచార్యులు

పెదపూడి: జి.మామిడాడలో ప్రసిద్ధి చెందిన ఉష, పద్మిని, ఛాయ, సౌంజ్ఞ సమేత సూర్యనారాయణ మూర్తి స్వామి ఆలయంలో స్వామివారికి ఆదివారం శాంతి కల్యాణం ఘనంగా నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై స్వామివారి కల్యాణం కనులారా తిలకించి భక్తి పరవశమయ్యారు. ఆలయంలో నిర్వహిస్తున్న 12వ సప్తాహ మహోత్సవాలు ఆదివారం ఘనంగా ముగిశాయి. ఆలయ ప్రధాన అర్చకుడు రేజేటి వెంకటనరసింహాచార్యులు చివరి రోజు ఉదయం స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి హోమం జరిపారు. స్థానిక తుల్యభాగ నదీపాయలో స్వామివారికి చక్రస్నానం చేయించారు. అనంతరం శాంతి కల్యాణం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా సప్తాహ కమిటీ కన్వీనర్ నల్లమిల్లి సుబ్రహ్మణ్యేశ్వరరెడ్డి, కమిటీ ప్రతినిధులు బి.ఛత్రపతి శివాజీ, కొవ్వూరు వెంకటరెడ్డి, మేడపాటి సాయిబాబారెడ్డి, మధుప్రసాద్‌రెడ్డి ఏర్పాట్లు పర్యవేక్షించారు.

పేద ప్రజల బ్యాంక్ ఇది


ఆర్యాపురం బ్యాంక్ సర్వసభ్య సమావేశానికి హాజరైన మంత్రి కందుల దుర్గేష్

రాజమహేంద్రవరం సిటీ: ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ పేద ప్రజల బ్యాంక్ అని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పేర్కొన్నారు. ఆదివారం రాజమహేంద్రవరంలోని ఎస్‌కేవీటీ ప్రభుత్వ డిగ్రీ కాలేజ్‌లో ఆర్యాపురం కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ 105వ సాధారణ మహాజన సభ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ బ్యాంకింగ్ రంగంలో ఎంతో అనుభవం ఉన్న చైర్మన్ చల్లా శంకరరావు నేతృత్వంలో, ఇతర డైరెక్టర్ల సారథ్యంలో పేద ప్రజలకు లోన్‌లు ఇవ్వడం, బ్యాంకును అభివృద్ధి పథంలో నడిపించడంలో సఫలీకృతులయ్యారన్నారు. ఆర్యాపురం కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ అద్భుతమైన ప్రగతి సాధించాలని, పేదల పక్షాన నిలిచి నంబర్–1 బ్యాంకుగా కీర్తి ప్రతిష్టలు గడించాలని ఆకాంక్షించారు. ప్రభుత్వం తరఫున బ్యాంకుకు అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య చౌదరి, బ్యాంక్ చైర్మన్ చల్లా శంకరరావు, వైస్ చైర్మన్ పరమేష్, డైరెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

యువతికి ప్రథమ చికిత్స అందించిన మంత్రి

కడియం: మండలంలోని కడియపులంక–వేమగిరి మధ్య ఆదివారం రెండు బైక్‌లు ప్రమాదవశాత్తు ఢీకొట్టుకోవడంతో ఒక యువతికి గాయాలయ్యాయి. అదే సమయంలో అటుగా వెళుతున్న మంత్రి కందుల దుర్గేష్ ఈ విషయాన్ని గమనించి, తన సిబ్బందిని అప్రమత్తం చేశారు. ఆయన స్వయంగా కాన్వాయ్ నుంచి కిందికి దిగి యువతికి ప్రథమ చికిత్స అందజేశారు.

పవన్‌కల్యాణ్‌వి మతి తప్పిన ప్రసంగాలు


మేడా శ్రీనివాస్

రాజమహేంద్రవరం సిటీ: పవన్‌కల్యాణ్ మతి తప్పిన ప్రసంగాలతో హిందూ ధర్మం పవిత్రతను కలుషితం చేస్తున్నారని రాష్ట్రీయ ప్రజా కాంగ్రెస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మేడా శ్రీనివాస్ ధ్వజమెత్తారు. ఆదివారం రాజమహేంద్రవరంలో ఆర్పీసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ చెడుకు త్వరగా ఆకర్షితులయ్యే కొంతమంది యువత పవన్‌కల్యాణ్‌ను ఆదర్శంగా తీసుకుంటూ మహిళలపై అఘాయిత్యాలకు కారణమవుతున్నారన్నారు. 'గోమాంసం తినండి, నేను తింటాను' అంటూ చెబుతున్న పవన్‌కల్యాణ్ హిందూ ధర్మాన్ని కలుషితం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పవన్‌కల్యాణ్ సినిమాలను తెలుగు రాష్ట్రాల్లో ప్రజలు బహిష్కరించకపోతే హిందూ సమాజం ప్రతిష్ట మంటగలిసిపోతుందన్నారు. కూటమి నుంచి పవన్‌కల్యాణ్‌ను బయటకు పంపించకపోతే మెజారిటీ హిందువులకు బీజేపీ దూరమవడం ఖాయమన్నారు.